సాక్షి వికారాబాద్



గొర్రెల పంపిణీ ఎప్పుడో?

జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులు రెండో విడత గొర్రెల పంపిణీ కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. 8లో▸



పవిత్రోత్సవాలు షురూ..

కొడంగల్ పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. 8లో▸



పత్తిలో పూత పద్ధతి మేలు

పత్తి సాగులో పెను బంక, దోమ నివారణకు పూత పద్ధతి ఎంతో మేలని ఏఓ జయశంకర్ తెలిపారు. 9లో▸

న్యూస్‌రీల్

ఎన్నికలకు సిద్ధం కావాలి



సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులు తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన రెవెన్యూ, సెక్టోరియల్, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెక్టోరియల్ అధికారులు అందరూ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, తక్కువ శాతం పోలింగ్ నమోదయ్యే, తొంభై శాతానికి పైగా నమోదయ్యే సెంటర్లను గుర్తించి నివేదిక అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో వికారాబాద్ నియోజకవర్గంలోని తహసీల్దార్లు, పోలీసు అధికారులు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా పీఎస్ సీఐగా చంద్రశేఖర్‌రెడ్డి



ఎస్పీ కోటిరెడ్డిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ మహిళా పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా సీఐ చంద్రశేఖర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి నుంచి ట్రాన్స్‌ఫర్‌పై వచ్చిన ఆయన బుధవారం మర్యాదపూర్వకంగా ఎస్పీ కోటిరెడ్డిని కలిశారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన సీఐ ప్రమీల ఎస్పీ కార్యాలయం కంట్రోల్ రూమ్‌కు బదిలీ అయ్యారు.

మిట్టబాసుపల్లిలో ‘క్రమబద్ధీకరణ’ ఇళ్ల పరిశీలన

తాండూరు రూరల్: జీవో 59 కింద మండలంలో 48 దరఖాస్తులు వచ్చాయని ఆర్‌ఐ బాల్‌రాజు అన్నారు. ఇప్పటి వరకు 20 దరఖాస్తులను పరిశీలించామని, మిగితావి త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. మిట్టబాసుపల్లి ప్రభుత్వ భూమిలో కట్టుకున్న ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు.2020 కన్నా ముందు ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నవారికి రెగ్యులరైజేషన్ అవకాశం ఉందని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ నరేందర్ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

ఉత్తమ సేవా పతకానికి ఎంపిక



హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్

తాండూరు రూరల్: కరన్‌కోట్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్ ఉత్తమ సేవా పతకానికి ఎంపిక య్యారని ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఏటా నిర్వహించే ఉత్తమ సేవా పతకాల్లో ఆయనకు చోటు దక్కిందని స్పష్టంచేశారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది, అధికారులు పవన్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పడగానే.. పట్టేశారు!

కొడంగల్ మండలం ఉడుమేశ్వరానికి చెందిన అనితకు గ్రామంలో ఐదెకరాల పొలం ఉంది. భర్త అకాల మరణంతో పిల్లలను తీసుకుని బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటోంది. ఆమె మామ పొలాన్ని సాగు చేస్తున్నాడు. మూడేళ్లుగా రైతుబంధు సాయం కింద ప్రభుత్వం జమ చేసిన రూ.1.20 లక్షలు అనిత ఖాతాలో జమయ్యాయి. అకౌంట్‌ను హోల్డ్ చేయడంతో ఎన్నిసార్లు తిరిగినా డబ్బులు అందడం లేదు. ఈ విషయమై ఆమె ఇటీవలే లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఆయన కొడంగల్ బ్యాంకు అధికారులతో మాట్లాడగా.. డబ్బులు ఇస్తామని చెప్పారు. మరుసటి రోజు ఆమె బ్యాంకుకు వెళ్లగా రూ.45 వేలు ఉన్నాయి.. పాతవి రెన్యువల్ చేయించుకోండి అంటూ కొర్రీలు పెట్టారు. తిరిగి ఆమె లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు ఫోన్ చేసి.. తన ఖాతాలో రూ.1.20 లక్షలు జమైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన వివరాలు పంపించడంతో డబ్బులు ఇచ్చేందుకు అంగీకరించారు. ఇలా ప్రతీ గ్రామంలో బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెడుతూనే ఉన్నారు.



చేతికందని ‘రైతుబంధు’

- పాత బకాయిల కింద ఖాతాలు హోల్డ్
- పంటల పెట్టుబడికి రైతుల అవస్థలు
- కలెక్టర్ ఆదేశాలు, వ్యవసాయాధికారుల అభ్యర్థనలను పట్టించుకోని బ్యాంకర్లు
- అవస్థల్లో అన్నదాతలు

వికారాబాద్: పంటల సాగుకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు పథకం డబ్బులు కొంత మంది రైతులకు చేతికందడం లేదు. పాత బకాయిల పేరుతో.. కాచుకు కూర్చున్న బ్యాంకర్లు అకౌంట్లలో డబ్బులు జమ కాగానే లాగేసుకుంటున్నారు. లేదంటే ఖాతాల్లో నుంచి నగదు తీసుకునే వెసులుబాటు లేకుండా హోల్డ్‌లో పెడుతున్నారు. దీంతో వానాకాలం సాగుకు కర్షకులు పెట్టుబడుల కోసం మళ్లీ ఎప్పటిలాగే షావుకార్లు, వడ్డీ వ్యాపారుల గడప తొక్కక తప్పటంలేదు. రైతుబంధు పథకం ప్రారంభమైన మొదటిసారి 2018 మేలో ప్రభుత్వం నగదు పంపిణీని ప్రారంభించింది. అప్పటి నుంచి బ్యాంకర్లు ఏదో రకంగా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతూనే ఉన్నారు. పెట్టుబడి సాయాన్ని పాత బకాయిల కింద పట్టుకోవద్దని కలెక్టర్ పదేపదే చెబుతున్నారు. రైతుబంధు విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకర్లకు లెటర్లు అందజేస్తున్నారు. కానీ ఇవేవీ అమలు కావడం లేదు.

ఇదీ పరిస్థితి..

జిల్లా వ్యాప్తంగా 6.40 లక్షల ఎకరాల సాగు భూమికి సంబంధించిన కర్షకులు రైతుబంధు పథకానికి అర్హులని వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు గుర్తించారు. జిల్లాలో మొత్తం 2,59,270 మంది రైతులు ఈసారి లబ్ధి పొందుతున్నారు. అర్హులను గుర్తించిన వ్యవసాయ శాఖ అధికారులు మండలాల వారీగా జాబితాను సిద్ధం చేసి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచారు. వీరికి ఎకరాకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.322,12,25,993 అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ మొత్తం పదిహేను రోజులుగా విడతల వారీగా రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 80 శాతం మందికిపైగా రైతులకు సాగు సాయం వారి ఖాతాల్లో జమయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు మరో వారం రోజులు పట్టే అవకాశముంది.

బ్యాంకర్ల తీరుపై విమర్శలు

ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకర్లు సాగు సాయాన్ని పట్టుకోవడంపై రైతుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలు సమీపిస్తుండటంతో బ్యాంకర్ల ఆగడాలకు కళ్లెం వేయకపోతే రైతుల నుంచి వ్యతిరేకత తప్పదని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ అసమర్థతవల్లే రైతులకు అన్యాయం జరుగుతోందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.



సాక్షి ఎఫెక్ట్.. తండాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాణామతి భయం వీడండి

- మూఢ విశ్వాసాలను నమ్మొద్దు
- ఇంటి ముందు నిమ్మకాయలు కోసి పడేస్తే రోగాలు రావు
- ఇంత మాత్రానికే జంకడం అవివేకమే అవుతుంది
- బషీరాబాద్ తహసీల్దార్ వెంకటస్వామి
- నంద్యానాయక్‌తండాలో అధికారుల అవగాహన సదస్సు

బషీరాబాద్: ప్రజలు మూఢ నమ్మకాలను విశ్వసించవద్దని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటస్వామి, ఎస్‌ఐ వేణుగోపాల్ సూచించారు. ‘నంద్యానాయక్‌తండాలో బాణామతి భయం’ శీర్షికన ‘సాక్షి’ మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం పోలీసులతో తండాలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక కాలంలో బాణామతి, చేతబడి వంటివి అపోహలేనని వివరించారు.నిమ్మకాయలు కోసి ఇంటి ముందు పడేస్తే ఎలాంటి రోగాలు రావని, మంత్రాలు,తంత్రాలను నమ్మవద్దనితెలిపారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యులను సంప్రదించాలని కానీ మంత్రగాళ్లు, బాబాల వద్దకు వెళ్లకూడదని సూచించారు. బాణామతి, చేతబడి తగ్గిస్తామని ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రస్తుతం అందరి వద్దా స్మార్ట్ ఫోన్లు ఉన్నాయని, టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తున్నా.. మూఢ నమ్మకాలతో ఆందోళన చెందడం అవివేకమే అవుతుందని స్పష్టంచేశారు. మాంత్రికుడి కోసం ఇంటింటికి రూ.500 వసూలు చేశారని పలువురు స్థానికులు పోలీసుల విచారణలో తెలిపారు. ఇలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా తండాలో బాణామతి భయం పుట్టించిన మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్ అధికారులు వచ్చిన సమయంలో స్థానికంగా లేకుండా పరారయ్యాడు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, సర్పంచ్ రవి, తండా పెద్దలు పాల్గొన్నారు.

టూరిజం స్పాట్‌గా అనంతగిరి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ ఇవ్వండి
- అధికారులు, ఇంజనీర్ల సమీక్షలో కలెక్టర్ ఆదేశం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పనులు చేపడుతామని వెల్లడి

వికారాబాద్ అర్బన్: టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అనంతగిరిని ఎంపిక చేశాయని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఇందుకోసం చేపట్టాల్సిన చర్యలు, పనులపై బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. స్వదేశ్ దర్శన్‌లో భాగంగా డెస్టినేషన్ ప్రాజెక్టు కింద ఎల్‌అండ్‌టీ ఇంజనీర్లు, సంబంధిత అధికారులతో చర్చించారు. వికారాబాద్‌లోని అనంతగిరి కొండలు నగరానికి సమీపంలో ఉండటంతో టూరిస్టులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని తెలిపారు. అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని సూచించారు. అనంతగిరిలో ఎకో పార్క్, వాకింగ్ ట్రాక్, పద్మనాభస్వామి ఆలయ అభివృద్ధి, పర్యాటకులకు వసతి, పార్కింగ్ సౌకర్యం, రెస్టారెంట్, పిల్లలకు ఆటస్థలం తదితర సదుపాయాల కల్పనపై చర్చించారు. అనంతగిరి టూరిజం అభివృద్ధి జరిగితే జిల్లాకు పర్యాటకుల తాకిడి మరింత ఎక్కువవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్‌రావు, ఇరిగేషన్ ఈఈ జెప్సినాథ్ పాల్గొన్నారు.

వైకుంఠధామాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి

వైకుంఠధామాలు ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, హరితహారం, మన ఊరు మనబడి, వెనుకబడిన కులాల వారికి కులవృత్తి ఆర్థికసాయం తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైకుంఠధామాల్లో నీటి సరఫరా, విద్యుత్ సరఫరా కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఉంటే సోలార్ విధానంపై దృష్టిసారించాలని తెలిపారు. క్రీడా ప్రాంగణాలకు అవసరమైన స్థలాలను గుర్తించి, నిర్ధారణ చేసిన పనులను చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమంలో నిర్వహించాల్సిన పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వచ్చే శనివారం జీపీ భవనాల పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలన్నారు.మనబడి కింద రూ.30 లక్షలలోపున్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హరితహారంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ.24 లక్షల వ్యయంతో కూడిన కంప్యూటర్లను కలెక్టర్ చేతుల మీదుగా ఎంపీడీఓలకు అందజేశారు. ఈ సమీక్షలో డీఆర్‌డీఓ కృష్ణన్, డీఈఓ రేణుకాదేవి, డీపీఓ తరుణ్‌కుమార్, ఇన్‌చార్జ్ సీఈఓ సుభాషిణి పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ వ్యతిరేకి రేవంత్

- ఆయన చేసిన వ్యాఖ్యలు చంద్రబాబువా..? కాంగ్రెస్‌వా..? చెప్పాలి
- రైతులంతా కేసీఆర్ వైపే ఉన్నారని కాంగ్రెస్ నేతల్లో అసహనం
- ఎంపీ రంజిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి: రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్ వ్యతిరేకి అని, రైతులంతా కేసీఆర్ వైపున్నారనే అసహనంతోనే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాధారంలో బుధవారం ఆయన చేవెళ్ల ఆరోగ్య రథాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతోనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. చిన్న పరీక్షల కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించవద్దని సూచించారు. ఆరోగ్య రథం వద్దే అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ప్రతీ గ్రామానికి ఆరోగ్య రథం వెళ్తుందని తెలిపారు. వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఇస్తారని తెలిపారు. తమ ఆస్పత్రి వద్ద కళ్లు, కీళ్ల నొప్పులు, సంబంధిత ఆపరేషన్లన్నీ ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ నేతల మాటల విడ్డూరం

ఉచిత విద్యుత్‌పై గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు మాటలు.. ప్రస్తుత రేవంత్‌రెడ్డి మాటలు ఒకే విధంగా ఉన్నాయని ఎంపీ మండిపడ్డారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేసిన విధంగా గతంలో ఏ ప్రభుత్వాలూ చేయలేదని తెలిపారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం తొమ్మిది గంటలు చాలని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి కేవలం 3 గంటల కరెంటే చాలనడం రైతు వ్యతిరేఖ వ్యాఖ్యలేనని తెలిపారు. రేవంత్‌రెడ్డి మాట్లాడే మాటలు చంద్రబాబు వా..? లేదా కాంగ్రెస్ పార్టీవా..? తేల్చుకోవాలని సూచించారు. అమెరికా వాళ్లకు వ్యవసాయం తెలియదని రేవంత్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడితే సరిపోదని..? అమెరికా నుంచి తెలంగాణకు వచ్చే లోపు తాను చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతులకు ఏం చేస్తున్నాయో చెప్పాలని సవాలు విసిరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, జెడ్పీటీసీ హరిప్రియ, సర్పంచ్ రాములు ముదిరాజ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

‘టెట్’ ఆశలు



వికారాబాద్ జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతులు

- కొత్తగా డీఎడ్, బీఎడ్ కోర్సు పూర్తి చేసిన వారికి మంచి అవకాశం
- పాత అభ్యర్థులకు మరిన్ని మార్కులు పెంచుకునే చాన్స్
- సుమారు పదివేల మందికిపైగా వెసులుబాటు
- నోటిఫికేషన్ విడుదల చేయాలని నిరుద్యోగుల అభ్యర్థన

వికారాబాద్ అర్బన్: మరోసారి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించడంతో నిరుద్యోగుల్లో మళ్లీ టెట్ ఆశలు చిగురించాయి. వారం రోజుల క్రితం మంత్రివర్గ ఉప సంఘం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవడంతో నిరుద్యోగులు తిరిగి టెట్‌కు సిద్ధమవుతున్నారు. ఇందులో అర్హత మార్కులు సాధించిన అభ్యర్థులకు మాత్రమే టీఆర్‌టీ రాసే అవకాశం దక్కుతుంది. గతేడాది జూన్‌లో ప్రభుత్వం టెట్ అర్హత పరీక్ష నిర్వహించింది.

వేల మంది ఎదురు చూపు

ప్రస్తుతం చాలా మంది డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు టెట్ కోసం ఎదురు చూస్తున్నారు. గతేడాది జూన్ నుంచి ఈసారి జూలై వరకు చాలా మంది అభ్యర్థులు డీఎడ్, బీఎడ్ కోర్సు పూర్తి చేసి టెట్ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ప్రభుత్వం టెట్ నిర్వహించకుండానే ఎక్కడ టీఆర్‌టీకి వెళ్తుందోననే భయం కొత్త అభ్యర్థులను వెంటాడింది. ఈ తరుణంలో ముందుగా టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పడంతో తాజాగా డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జూన్‌లో విద్యాశాఖ టెట్ పరీక్ష నిర్వహించింది. అప్పట్లో చాలా మంది డీఎడ్, బీఎడ్ చేసిన వారు అర్హత సాధించలేకపోయారు. ఉపాధ్యాయుల బదిలీల చిక్కు వీడితే ప్రభుత్వం మరోమారు టీఆర్‌టీ నిర్వహించే ఆలోచనలో ఉండటంతో నిరుద్యోగులు టెట్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. టెట్ నిర్వహిస్తే ముందుగా అర్హత సాధించని వారితో పాటు, కొత్త వారికి అవకాశం రానుంది.

గత టెట్‌లో పేపర్ -1కు హాజరైన అభ్యర్థులు:	**5,569**
పేపర్ -2 రాసిన వారు:	**3599**
ఈ ఏడాది డీఎడ్ పూర్తిచేసిన వారు:	**500**
బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు:	**400**

ప్రకటనలతో సరిపెట్టొద్దు

కొన్ని నెలలుగా ప్రభుత్వం ఆయా శాఖల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తుండటంతో పాటు, ఇటీవలే గ్రూప్- 1, గ్రూప్- 4, కానిస్టేబుల్ వంటి పరీక్షలను పూర్తి చేసింది. ఇదే తరహాలో టీఆర్‌టీ కూడా నిర్వహిస్తుందని అభ్యర్థులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలతో సరిపెట్టకుండా టెట్‌తో పాటు ఆ వెంటనే టీఆర్‌టీ నిర్వహించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. గతేడాది కాలంగా ఏదో ఒక నోటిఫికేషన్ వస్తుండటంతో ప్రైవేటు ఉద్యోగాలు మానుకొని, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా పరీక్షలకు సిద్ధమవుతున్నామని నిరుద్యోగులు చెబుతున్నారు. పైగా మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు టెట్ నిర్వహణపై తలోమాట చెప్పడంతో అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు. ఇటీవల మిగతా ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించినట్లే టెట్, టీఆర్‌టీ నిర్వహించాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వ ప్రకటన తర్వాత ప్రైవేటు కోచింగ్ సెంటర్లు టెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రచారం చేస్తున్నా, అభ్యర్థుల నుంచి పెద్దగా స్పందన రావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ వెలువడే వరకు వేచి చూడాలనే ధోరణిలో ఉన్నారు.



యాగశాలలో గజరాజు ఆశీస్సులు పొందుతున్న మంత్రి సబితారెడ్డి



గజరాజు వద్ద ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేల సందడి

• కనుల పండువగా యాగం

ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తాండూరులో నిర్వహిస్తున్న యాగాలను బుధవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సందర్శించారు. యాగశాలలో కొనసాగుతున్న యజ్ఞాలు, హోమాలను తిలకించి, పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులు ఆమెను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్, పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి యాగస్థలిని సందర్శించారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వీరిని పూలమాలలతో సన్మానించారు. సినీ హీరో, ఎమ్మెల్యే స్నేహితుడు మంచు మనోజ్ సతీసమేతంగా యాగానికి వచ్చారు.

– తాండూరు

క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని మోత్కు పల్లి, బార్వాద్‌ తండాలో బుధవారం ఈవీఎంలపై ఆర్‌ఐ రమేశ్‌ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాలెట్‌ యూనిట్‌, కంట్రోల్‌ యూనిట్‌, వీవీ ప్యాట్‌ల పై వివరించారు. ఈవీఎంల పై ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేస్తామన్నారు. ఈ నెల 18 వరకు గ్రామాల్లో ఈవీఎంల పై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

'మల్టీపర్పస్‌ విధానాన్ని రద్దు చేయాలి'

దౌల్తాబాద్‌: జీఓ 51 సవరణ, మల్టీపర్పస్‌ విధానం రద్దు, జీతాల పెంపు, ఉద్యోగ క్రమబద్ధీకరణ కోసం జీపీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఏడో రోజుకు చేరింది. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల జీపీ కార్మికుల సంఘం అధ్యక్షులు సాయిలు తదితరులున్నారు.

బీసీల ప్లీనరీకి తరలిరండి



వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతగిరి: బీసీల రాజకీయ ప్లీనరీని విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌ గౌడ్‌ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పదివేల మంది ప్రతినిధులతో నిర్వహించే ప్లీనరీ తెలంగాణలో రాజకీయాలను శాసించబోతోందన్నారు. ప్లీనరీ ఈ నెల 15న ఎల్బీనగర్‌ లోని కేబీఆర్‌ కన్వెన్షన్‌ హాలులో జరుగుతుందన్నారు. తెలంగాణలోని బీఆర్‌ఎస్‌ పార్టీ, కాంగ్రెస్‌ పార్టీలో అగ్రకుల నాయకులకు పార్టీ పగ్గాలు అప్పజెప్పారని అన్నారు. ఇంతకాలం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేత సంజయ్‌ని సైతం తప్పించి అగ్రకులాలకే బాధ్యతలు అప్పజెప్పారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, వికారాబాద్‌ జిల్లా యువజన అధ్యక్షుడు అనిల్‌ కుమార్‌, రంగారెడ్డి జిల్లా యువజన అధ్యక్షుడు మల్లేశ్‌ యాదవ్‌, కొడంగల్‌ యువజన అధ్యక్షుడు మధు, శ్రీకాంత్‌, కేశవులు, మహేష్‌, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ బిల్లులు చెల్లించండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య
- కలెక్టరేట్‌ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

అనంతగిరి: మధ్యాహ్న భోజన కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్‌ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్‌ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్‌ 8 ప్రకారం వేతనాలను ఏరియర్స్‌ తో సహా చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్ర వంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వవద్దన్నారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్‌ కేటాయించాలన్నారు. అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీపై వెంటనే ఇవ్వాలన్నారు. వంటలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ నాయకులు రాజు, యాదయ్య, మల్లేశం, శ్రీనివాస్‌ ,మల్లమ్మ, అంతమ్మ, అలివేలు, సువర్ణ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మయూరం.. ముగ్ధమనోహరం

నెమలి పురివిప్పితేనే.. కనులకు ఇంపుగా ఉంటుంది.. పురివిప్పి నాట్యం చేస్తే ఆ దృశ్యం వర్ణించలేం. ఆ దృశ్యం చూశాక ప్రకృతిలో అందమైనది మరొకటి ఉండదేమో అనిపిస్తుంది. ఇలాంటి దృశ్యమే ధారూరు మండలం నాగసమందర్‌లో బుధవారం చోటుచేసుకుంది. గ్రామంలో ఇళ్లమధ్య అందరూ చూస్తుండగా ఓ నెమలి పురివిప్పి నాట్యం చేసింది. సుమారు ఐదు నిమిషాల పాటు నాట్యం చేస్తూ తనను తాను మరిచిపోయింది. స్థానికులు తదేకంగా చూస్తున్నా భయం లేకుండా పురివిప్పి చుట్టూ తిరుగుతూ నాట్యం చేస్తున్న ముగ్ధమనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌ మనిపించింది.

– ధారూరు



నాగసమందర్‌లో ఓ ఇంటి ఎదుట పురివిప్పి నాట్యం చేస్తున్న నెమలి

గా పిల్ల మోసం చేసింది.. ఉండలేక పోతున్న..

శంకర్‌పల్లి/చేవెళ్ల: 'ప్రేమించిన అమ్మాయి విడిచిపెట్టి పోయింది.గా పిల్ల నన్ను ఘోరంగా మోసం చేసింది. ఇక నేను ఉండలేక పోతున్న' అంటూ అగ్రికల్చర్‌ బీఎస్సీ విద్యార్థి సెల్ఫీ వీడియో ద్వారా తన సోదరుడికి సమాచారం అందించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి రైల్వేస్టేషన్‌ సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్‌ జిల్లా తాండూరు మండలం అల్లాపూర్‌కు చెందిన కురువ మహేశ్‌(21) నగరంలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో అగ్రికల్చర్‌ బీఎస్సీ చదువుతున్నాడు. ఓ అమ్మాయితో ప్రేమ విఫలమై ఇద్దరి మధ్య అగాధం పెరిగింది. ఏం జరిగిందో కానీ ప్రియురాలు తనను విడిచిపెట్టి పోయిందని తీవ్ర మనస్తాపం చెందాడు. దీన్ని జీర్ణించుకోలేకపోయాడు. చివరికి చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. శంకర్‌పల్లి రైల్వేస్టేషన్‌ సమీపంలోని పట్టాల పైకి వెళ్లి సెల్ఫీ వీడియో ద్వారా అన్నకు ఈ విషయం చెప్పాడు. ఇక తాను ఉండలేనని, అమ్మానాన్నలను మంచిగా చూసుకోవాలి.. ఇక పోతా అంటూ గూడ్స్‌ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల మొండెం రెండు ముక్కలై మృతదేహం ఛిద్రమైంది. అతని వద్ద మల్లారెడ్డి యూనివర్సిటీ ఐడీ కార్డు ఉంది. ప్రయోజకుడు అవుతాడనుకున్న కొడుకు అర్ధంతరంగా తనువు చాలించటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మహేశ్‌ (ఫైల్‌)

స్వామివారి పవిత్రోత్సవాలు షురూ..

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు బుధవారం రాత్రి అంకురార్పణ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ముఖ్య అర్చకుల పర్యవేక్షణలో పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలో ఉత్సవ ఊరేగింపు చేపట్టారు. మండపంలో విశ్వక్సేనులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భూమాతకు, పుట్టకు ప్రత్యేక పూజలు చేసి పుట్ట మన్ను సేకరించారు. తాండూరు వాసవి మహిళా భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో భజనలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ధర్మకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దర్శించుకున్నారు.



సేనాధిపతి వాహనంపై స్వామివారు



ఉత్సవ ఊరేగింపులో అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు

గొర్రెల పంపిణీ ఎప్పుడో?

- జీవాల కోసం ఎదురు చూపులు
- దశాబ్ది ఉత్సవాల్లో కొందరికే..
- మిగిలిన వారికి అందించడంలో జాప్యం

కొడంగల్‌: గొల్ల కురుమల అభ్యున్నతి కోసం గొర్రె పిల్లల పంపిణీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. సబ్సిడీపై జీవాలను ఇస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తారని పాలకులు భావించారు. అయితే పథకం బాగున్నా అమలులో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోందనే అపవాదు ఉంది. మొదటి విడతలో కొంత మందికి జీవాలను పంపిణీ చేశారు. మరి కొంత మంది అధికారుల చేతి వాటం వల్ల జీవాలు ఇచ్చినట్లు కాగితాలు, ఫొటోలు సృష్టించారు. కమీషన్ల కోసం పథకాన్ని నీరు గార్చారు. జీవాలను రీసైక్లింగ్‌ చేస్తూ పశు సంవర్ధక శాఖ అధికారులు పట్టుబడ్డారు. కనీసం రెండో విడతలోనైనా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని గొల్ల కురుమలు కోరుతున్నారు.

గొర్రెల పంపిణీ జరిగేనా?

కొంత మంది గొర్రెల కాపరులు అప్పులు చేసి డీడీలు చెల్లించారు. ఏళ్లు గడుస్తున్నా జీవాల పంపిణీ జరగకపోవడంతో మిత్తి పెరిగిపోతుందని ఆందోళన చెందుతున్నారు. రాయితీపై అందజేస్తున్న రెండో విడత గొర్రెల పంపిణీ ప్రక్రియలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో లబ్ధిదారులకు జీవాలు అందడం లేదు. దీంతో డీడీలు కట్టి ఏళ్లు గడుస్తున్నా ఎదురు చూపులు తప్పడం లేదు. గొర్రెల కాపరుల్లో నిరాశ అసంతృప్తి నెలకొంది. ఈ క్రమంలో గొర్రెలు ఎప్పుడిస్తారని పశుసంవర్ధక శాఖ అధికారులను నిలదీస్తున్నారు. అధికారులు కూడా త్వరలో వస్తాయని చెప్పడం తప్ప చేసేది ఏమీ లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జరిగిన తెలంగాణా దశాబ్ది ఉత్సవాల్లో గొర్రెల పంపిణీ ప్రారంభించిన ప్రభుత్వం జిల్లాలో నామ మాత్రంగా పంపిణీ చేశారు. ఉత్సవాలు ముగిసి నెల అవుతున్నా మళ్లీ ఇంత వరకు ఒక్క గొర్రెను కూడా ఇవ్వలేదు. డీడీలు కట్టిన వారికి జీవాలు రాకపోవడంతో కొత్తగా డీడీలు కట్టడానికి గొల్ల కురుమలు జంకుతున్నారు.



దశాబ్ది ఉత్సవాల్లో పంపిణీ చేసిన జీవాలు (ఫైల్‌)

దశాబ్ది ఉత్సవాల్లో 12 మందికి మాత్రమే..

నియోజకవర్గంలోని బొంరాస్‌పేట మండలం ఎనికెపల్లికి చెందిన 12 మంది లబ్ధిదారులకు దశాబ్ది ఉత్సవాల్లో గొర్రెలను పంపిణీ చేశారు. కుల వృత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్‌ గొర్రెలను సబ్సిడీపై ఇవ్వడానికి ముందుకు వచ్చారు. 20 గొర్రెలు, ఒక పొట్టేల్‌ను అందజేస్తున్నారు. ఒక్క యూనిట్‌ ధర రూ. లక్షా 75వేలకు పెంచారు. ఇందులో లక్షా 31వేల 250 రూపాయలు సబ్సిడీ ఉంది. లబ్ధిదారులు రూ.43,750 చెల్లిస్తే సరిపోతుంది. ప్రతి ఏడాది పుట్టిన గొర్రె పిల్లలను విక్రయించడం ద్వారా గొల్ల కురుమలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనేది ప్రభుత్వ నిర్ణయం. అయితే క్షేత్ర స్థాయిలో పథకం అమలు కావడం లేదనే అభిప్రాయం ఉంది. మొదటి విడతలో పశు సంవర్ధక శాఖ అధికారులు గొర్రె పిల్లలను రీ సైక్లింగ్‌ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నిజమైన లబ్ధిదారులకు జీవాలను ఇవ్వకుండా కమీషన్లపై వ్యాపారం చేసినట్లు విమర్శలు ఉన్నాయి. రెండో విడతలోనైనా అధికారులు జీవాల పంపిణీలో పారదర్శకంగా ఉండాలని గొల్ల కురుమల సంఘం నాయకులు కోరుతున్నారు.

గొర్రెలకు బదులు నగదు అందజేయండి

మర్పల్లి: గొల్ల, కురుమలకు, యాదవ కులస్తులకు ప్రభుత్వం ఇచ్చే గొర్రెల యూనిట్లకు బదులు నగదు అందజేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి రవికుమార్‌ యాదవ్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి విడతలో ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి పంపిణీ చేయడంతో లబ్ధిదారులు నష్టాలు చవిచూశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి గొర్రెలను కొనుగోలు చేసి ఇవ్వడంతో ఇక్కడి వాతావరణం పడక, మరోవైపు రవాణా సమయంలో చాలా వరకు గొర్రెలు మృతి చెందాయని అన్నారు. ఇక్కడి వాతావరణానికి అనుకూలంగా స్థానికంగా లభించే గొర్రెలను కొనుగోలు చేసి ఇస్తే కుర్మ, యాదవ, గొల్ల కులస్తులకు కొంత మేరకు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. గొర్రెల యూనిట్‌ను గొనుగోలు చేసేందుకు లబ్ధిదారులకే అవకాశం ఇవ్వాలన్నారు.



రవికుమార్‌ యాదవ్‌

ఉచిత విద్యుత్‌ పేరుతో నిలువుదోపిడీ

- డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ
- సీఎం కేసీఆర్‌ దిష్టిబొమ్మ దహనం

పరిగి: ఉచిత విద్యుత్‌ పేరుతో ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ అన్నారు. బుధవారం పరిగి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఎదుట కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ని డ్రామాలు ఆడినా తెలంగాణ సమాజం కేసీఆర్‌ను నమ్మే ప్రసక్తే లేదన్నారు. ఉచిత విద్యుత్‌ అంటూ తెలంగాణపై పెను భారం మోపుతున్న బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం డిస్కంలను రూ.50వేల కోట్ల నష్టంలోకి నెట్టేసి తెలంగాణను నిండా ముంచుతున్నారన్నారు. రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా 9గంటలకు మించి విద్యుత్‌ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్‌, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

అధికారుల సూచనలు పాటించాలి



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ

అనంతగిరి: రైతులు వ్యవసాయాధికారుల సూచనలను పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌ అన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌ మండలం కొత్తగడి క్లస్టర్‌లో సబ్సిడీ కింద ఇచ్చిన కందులు, మినుముల పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ వర్షాలు పడినపుడు కాల్వల ద్వారా నీటిని తీసేయాలన్నారు. పరిమితికి మించి క్రిమి సంహారక మందులు వాడవద్దన్నారు. పంటకు వచ్చిన తెగులుకు ఏ మందు పిచికారీ చేస్తే నయమవుతుందనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ఉంటున్న వ్యవసాయాధికారులను అడగాలని అన్నారు. ఆయన వెంట ఏఓ జ్యోతి, ఏఈఓ అనిల్‌కుమార్‌, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాడవుతున్న గన్నీ బ్యాగులు

ధారూరు: పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసిన 10 వేల గన్నీ బ్యాగులను ఆరుబయట పడేశారు. అవి వానకు తడుస్తూ పాడవుతున్నాయి. మండల పరిధిలోని గట్టెపల్లిలో వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. హరిదాస్‌పల్లి పీఏసీఎస్‌ ద్వారా గట్టెపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి పౌరసరఫరాలశాఖ ద్వారా 10 వేల గన్నీ బ్యాగులను సరఫరా చేశారు. పనికిరాని బ్యాగులన్నాయని వాటిని తిరస్కరించారు. తర్వాత తీసుకెళ్తామని చెప్పి ఇక్కడ వేసి వెళ్లారు. కొనుగోలు కేంద్రాన్ని మూసివేసినా గన్నీ బ్యాగులను పౌరసరఫరాల శాఖ సిబ్బంది తీసుకెళ్లలేదు. ఈ బ్యాగులను ఎవరూ పట్టించుకోవడంలేదు. తమకు గన్నీ బ్యాగులు కావాలనీ కోరిన మాట వాస్తమేనని, పనికిరాని బ్యాగులు పంపిస్తే తిరస్కరించామని పీఏసీఎస్‌ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి చెబుతున్నారు. మొత్తానికి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం ధనం ఇలా మట్టిపాలు అవుతోందని రైతులు వాపోతున్నారు.



గట్టెపల్లి గ్రామంలో వానకు తడుస్తున్న గన్నీబ్యాగులు

ఆటో బైక్‌ ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

పరిగి: ఆటో, బైక్‌ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సయ్యద్‌మల్కాపూర్‌ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిట్యాల గ్రామానికి చెందిన శివకుమార్‌ పరిగిలో బైక్‌మెకానిక్‌గా పనిచేస్తుంటారు. బుధవారం రాత్రి చిట్యాల గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. సయ్యద్‌పల్లికి చెందిన మల్లేశ్‌ తన ఆటోతో ఎదురుగా వస్తుండగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన ఆక్కడి నుంచి నగరానికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

మోత్కూరు గేట్‌ సమీపంలో కుళ్లిన శవం

దోమ: మండల పరిధి మోత్కూర్‌ గేట్‌ సమీపంలోని ఇంటిలో కుళ్లిపోయిన శవం కనిపించింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఇబ్రహీం(72) అనే వ్యక్తిగా గుర్తించారు. మృతుడికి సంతానం లేకపోవడంతో భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి అతను గేటు సమీపంలోనే ఇల్లు నిర్మించుకుని చెప్పులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. అయితే అతను ఇంట్లోనే నిద్రిస్తున్న సమయంలో మృతి చెంది ఉంటారని, ఆ క్రమంలోనే శవం కుళ్లి పోయి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న లారీ

క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌

పరిగి: చెట్టును లారీ ఢీకొనడంతో డ్రైవర్‌ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ఈ ఘటన చిట్యాల గ్రామ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. షాద్‌నగర్‌ నుంచి పరిగి వైపు వస్తున్న లారీ అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొంది. దీంతో డ్రైవర్‌ క్యాబిన్‌లోనే ఇరుక్కు పోయాడు. చుట్టుపక్కల జనాలు చూసి క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకి తీసేందుకు శ్రమిస్తున్నారు. వివరాలు అందాల్సి వుంది.

కాగ్నా బ్రిడ్జికి ఉరేసుకుని.. కర్ణాటక వాసి ఆత్మహత్య

యాలాల: తాండూరు-కొడంగల్‌ మార్గంలోని కాగ్నా కొత్త బ్రిడ్జికి తాడుకట్టి ఓ వ్యక్తి ఉరేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరవింద్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం అంపల్లికి చెందిన నగేష్‌ (30) తాండూరు పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉంటూ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో మంగళవారం రాత్రి బ్రిడ్జికి తాడు కట్టి ఉరేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం గమనించిన స్థానికులు యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్‌ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలంలో వివరాలు సేకరించారు. మృతుడి జేబులో కాగితంపై రాసి ఉన్న తల్లి ఫోన్‌ నంబరు ఆధారంగా వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య స్వప్నతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అభినందనీయం

తాండూరు టౌన్‌: ఎమ్మెల్యే రోహిత్‌ రెడ్డి చేపట్టిన రాజశ్యామల, శతచండీ, సౌర, లక్ష్మీసుదర్శన సహిత అతిరుద్ర మహాయాగంపై జిల్లా కురుమ సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోహిర్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాల కోసం 11 రోజుల పాటు యాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. వేలాది మంది పుణ్యదంపతులకు ఈ యాగంలో భాగస్వాములను చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్‌, ఉపాధ్యక్షుడు పూజారి పాండు, నాయకులు వీరేశం మల్లేశం , మల్లప్ప, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న కురుమ సంఘం నాయకులు

బీఆర్‌ఎస్‌లో చేరిక

అనంతగిరి: వికారాబాద్‌ మండలం సిద్దులూర్‌కు చెందిన పలువురు నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్‌ మెతుకు ఆనంద్‌, మహేశ్‌ రెడ్డిల సమక్షంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు